# గతి తప్పిన జీవితం

రచన:
శ్రీ సుంకర భాస్కరరావు.

చివరి వరకూ కాలిన సిగరెట్ కరుణాకర్ పెదాలకి చురక వేసింది.

ఛ! గతం నాస్తి! తను ప్రేమించినా, తనది కాక పోయిన యీ భారతి గురించి ఆలోచిస్తూ బాధ పడటం నిరుపయోగం. ఇక తను యిలా భారతి ఆలోచనలతోనే పిచ్చెత్తినట్లు తయారవటం, తద్వారా తనని నమ్ముకున్న మమతకి దూరమవటం, పెళ్ళాడి కూడ భార్యని సుఖపెట్టక పోవటం—యివన్నీ తను చేసిన చేయరాని నేరాలు! తను మనస్సు కంట్రోల్ చేసుకోవాలి! ఏ పాపం ఎరుగని అమాయక జీవి మమతని తను యిలా అజాతంగానే క్షమింపరాని నేరం!

అతని అడుగులు నెమ్మదిగా యింటి వైపు పడటం ప్రారంభించాయ్. మనసులో మమత మీద మొదటి సారిగా మమత' ఉదయించింది.

వీధిలో స్ట్రీట్ లైట్స్ వెలగ లేదింకా. ఇంట్లో కూడ దీపం వెలగటం లేదు. మమత మనసులో ఎప్పుడో తాత్కాలికంగా వెలిగిన ఆశాదీపం ఆరిపోయి నెమ్మదిగా, నీళ్ళు కలిసిన కిరసనాయిల్ వత్తిలా యిప్పుడు వెలగటమే మానేసింది. అమావశ్య కావటాన ఆకాశం చీకటిగా వుంది. మమత మనసులో కూడ చీకటి ఆముకుంటుంది.

ఆయన కాలేజీలో ఎవర్నో ప్రేమిస్తే, ఆమెనే ఎంచుకు పెళ్ళి చేసుకోలేదు ఆమె ఒప్పుకో పోతే పెళ్ళికి, ఆమె నెందుకు మర్చిపోలేరు? ఆమెని మర్చిపోలేకపోతే యీ నరకం పళ్లచక్రాలు మధ్య చంపాలనేనా తనని ఆయన పెళ్ళాడటం.

ఏం మాట్లాడాలన్నా ఎప్పుడూ సమాధిలో వున్నట్లే వుంటారు. పిలిస్తే పలకరు. పడుకుంటే లేపకూడదు. లేస్తే పలకరు. పలకరించాక కూడ ఫలితం చూడలేం! ఏమి మనిషో ఆయన!

'నన్ను వేధించక, వెళ్ళు!' అన్నమాట ఎన్నిసార్లు వింది తనీ చెవులతో, అంత బాధాకరంగా వున్నానేనాయనకి?

భగవాన్! ఎందుకిచ్చావ్ నాకీజన్మ! పుట్టుకతోనే తల్లిని కోల్పోయినది కాక, అనతికాలంలోనే తండ్రిని కోల్పోయి—అగాథలా అయినా అమృత హృదయుడైన బాబాయి దగ్గర పోయిన మాతాపితల అనంత ప్రేమని పొందగలిగినా—పెళ్ళయినదే మొదలు నాకీ అసహన వ్యథ తప్పని సరి అవుతుందనే పక్కింటి రాధమ్మ అనే మాటలు నిజంగానే తోస్తున్నాయ్. 'ఆడది పుట్టింది అత్తింట బాధలు పడడానికి అమ్మాయ్' అనేది రాధమ్మ. కాని మరీ యింత నికృష్టపు బ్రతుకు బ్రతకనేల?

తనెంత దగ్గరవుతుంటే ఆయన అంతగా దూరమవుతున్నారు. తను ఏ పని చేసినా ఆయనకి చిరాకే! తనని చూస్తేనే ఆయనకి అసహ్యం! ఒకవేళ తను ఆయన ప్రేమించిన యువతి అంత అందంగా లేనేమో! లేకపోతే, ఆ నింద భగవంతునిమీద వెయ్యాలి! అంత అందంగా పుట్టించనందుకు కాదు! అంత అందం కోరుకునే వ్యక్తికి భార్యను చేసినందుకు!

ఆడదానికి పెళ్ళి అయిన తరువాత తల్లి-తండ్రి సర్వస్వం భర్త గదా! అలాంటి భర్త దగ్గరే ప్రేమానురాగాలు కరువైనప్పుడు ఆ స్త్రీ వున్నా ఫలమేమి? ఎండుగడ్డిలాంటి యీ శుష్కజీవితం గడిపి ఏం సుఖించాలి. పోనీ తనకు సౌఖ్యం లేకపోయినా పర్వా లేదు ఒకరిని సుఖపెడుతుంటే! కాని అదీలేదే! తను ఆయిన్ని సుఖపెట్టటం లేదు సరిగదా తన నిత్య దర్శనంతో ఆయన్ని చికాకు పెడ్తుంది! అలాంటప్పుడు తను ఆయనకి దూరమయితే—ఆయనకి మనశ్శాంతి అయినా లభిస్తుందేమో!

నెమ్మదిగా లైటువేసి, కాగితం కలం తీసుకుని ఒక ఉత్తరం రాసి, మడచి టేబిల్ మీద పెట్టి, ఆ చీకట్లో తన నిశ్చయాన్ని, [illegible]ని లక్ష్యాన్ని వెదుక్కుంటూ రోడుమీద నడవసాగింది మమత.

కరుణాకర్ వడివడిగా నడవసాగాడు యింటివైపు అతని మనసులో నేడు ఎన్నడూ లేని విధంగా మమత మీద మమకారం కట్టలు తెంచుకు ప్రవహిస్తుంది. అతని కళ్ళలో అప్పుడప్పుడు చూసే మమత దీనదృక్కులు

కనిపిస్తున్నాయి. మొదటిసారిగా ఆ చూపులనీ అర్థం చేసుకోవటం ప్రారంభించాడు కరుణాకర్.

ముందుగా మమతని మనసారా కౌగలించుకోవాలి, ముద్దులతో ముంచెయ్యాలి. తరువాత మమత చేమలు గుంజేస్తూ 'నేను క్షమించానను మమతా' అని క్షమా పణ వేడుకోవాలి. మమత మనసు వెన్న,' తప్పకుండా తనని క్షమించగలదు!

ఇంటి గుమ్మం ఎక్కాడు. తలుపు తట్టాడు. లోపలికి తోసాడు. గదిలో దీపం లేదు. క్రొత్తగా కాని బాధగా మొదటిసారి తోచింది.

'మమతా' అంటూ పిలిచాడు. ఎక్కడా కదలిక కనిపించలేదు.

స్విచ్ బోర్డు మీద అతని చెయ్యి పడింది. లైటు వెలిగింది. వంటగది, పెరడు అన్నీ వెదికాడు మమత కనపడలేదు. సడెన్‌గా అతని దృష్టి టేబిల్ మీద వున్న కాగితం మడత మీద పడింది. విప్పి, చదవ సాగాడు—

పూజ్యులైన కరుణాకర్ గార్కి—

మీ భార్య మమత నమస్కారములు—

మన వివాహమయి యిన్నాళ్ళయినా ఒక్కసారి నాతో మీరు ఆనందంగా మాట్లాడి ఎరుగరు. నావల్ల మీకు బాధే గాని సుఖం లేశ మాత్రం కూడ దొరకటం లేదు. మిమ్మల్ని బాధ పెడ్తూ, మీ బాధ చూసి బాధపడ్తూ మీ ముందు నిలవలేని అభాగ్యురాలిని మీకు దూరంగా పోతున్నా. నన్ను గురించి బాధ పడ వద్దని ప్రార్థన!

ఇట్లు

మీ భార్య మమత

ఉత్తరం చూసి పిచ్చెత్తినట్లు తిరిగాడు ఆ పరిసరాలు. కాని మమత కనిపించలేదు. అనుమానం వున్న స్థలాలన్నీ వెదికాడు. ఏమీ ఊహించుకోలేక పోయాడు. మమత ఏమైనా అఘాయిత్యం చేసిందా? లేక బాబాయి దగ్గరికి వెళ్ళిందా?

మమత బాబాయి వూరు వెళ్ళాడు. వెంటనే కరుణాకర్—

'ఏం అబ్బాయ్! మమతను ఇలా తీసుకు రాలేకపోయావా? పిచ్చి పిల్ల! మనసులో [illegible] మీద ఎంత ప్రేమున్నా, తనూ బయలుదేరుతానని నీతో చెప్పలేకపోయి వుంటుంది!' అన్నారు మమత బాబాయి కరుణాకర్ తో—

కరుణాకర్ పెదాలు మెదప లేక పోయాడు. అక్కడ ఏమీ బయటపడకుండా, బయట పడ్డాడు.

మమతా! నన్నెంత అన్యాయం చేసావ్! నా నేరానికి యింత పెద్ద శిక్షే నా మమతా! అయ్యో! నా జీవితం చిరిగి పోయింది. కాని నా మనసులో మమత చెరగలేదు! చెరగదు! అనుకున్నాడు కరుణాకర్.

అది నిజమే! కరుణాకర్ చిరిగేక గాని అతని మనసులో మమత చెరగదు! అంతలా పాతుకు పోయింది మమత! అందుకు కరుణాకర్ హృదయమున్న వ్యక్తిగా బట్టి, యీ అఘాతానికి తట్టుకోలేక పోయాడు. సర్వస్వం త్యజించి, ఊరూర దేశ దిమ్మరిలా తిరగటం ప్రారంభించాడు. సుమారు పిచ్చివాడై పోయాడు కరుణాకర్!

\+ + + + +

ఆత్మహత్యా ప్రయత్నంలో వున్న మమత అనాథ శరణాలయం వార్డెన్ సుందరమ్మ దృష్టిలో పడింది. సుందరమ్మ ఆ క్షణం భగవంతుడు పంపిన దూత మాదిరి అయిపోయింది. ఆమె జీవితం ఆధ్యాత్మికంగా, భగవత్ప్రీతితో వెలిగి పోతుంది. అలాంటి ఆమెలో ఒక భగవదాంశం ముంచి ముందుకొచ్చి మమతను విజయవాడ తీసుకు పోయింది. మనిషిలో మానవత వుంటే అదెప్పుడూ మరో మనిషిలోనీ మానవత రక్షించటానికి వెనుదీయదు! అదే సుందరమ్మ—మమతల మధ్య జరిగింది.

మమత స్కూల్ ఫైనల్ పాసయి వుండటం చేత అనాథ శరణాలయంలో పిల్లలకి ఉపాధ్యాయినిగా వుపయోగపడుతూ, సుందరమ్మతోటే వుంటూ వుంది.

ఉదయం నుండి సాయంత్రం వరకు చిరుహృదయాలతో కాలం గడిపి, సాయంత్రం యింటికొచ్చి సుందరమ్మకి వంటలో సాయపడుతూ, తన జీవితాన్నీ విధంగా తీర్చిదిద్దిన సుందరమ్మకి కృతజ్ఞతతో మనసులోనే నమస్కారం పెట్టుకుంటుంది. పడుకుందే ముందు గీతాపారాయణం చేసి పడుకుంటుందిగాని భర్త కరుణాకర్ గుర్తుకొస్తాడు. తాము చేసింది క్షమించరాని

నేరంగా ఫీలవుతూ మథన పడుతుంది. బాబాయి దగ్గరికి వెళ్దామన్నా, యీ విషయం కరుణాకర్ చెప్పి వుంటే ఆయన కూడదని అసహ్యించుకుంటారని ఆ పని మానుకుంది.

ఇలా కొన్నాళ్ళు గడిచాయి. కాని రోజురోజుకి మమతలో మనశ్శాంతి కరువయి పోయింది. ఒకనాడు సుందరమ్మతో 'ఏమండీ! నేనైమై పోయానో అని ఆయన బెంగపెట్టుకున్నారేమో! నేను ఆవేశంలో యిలా చేసాను గాని, అసలే తను ప్రేమించిన అమ్మాయి దొరకలేదని బాధపడుతున్న ఆయనే ఎలా అయిపోయారో ఏమో అని బాధగావుంది. ఒకసారి వెళ్దాం రండి!' అంది మమత.

కాస్సేపు మౌనం వహించి సుందరమ్మ యిలా అంది. 'మమతా! నీకంటె ముందుగానే నాకీ ఉద్దేశం కలిగింది. అందుకే నేను మీ ఆయన గురించి ఎంక్వయిరీ చేయించాను. కాని ఆయన యించుమించు నీవు యిలా వచ్చేసిన దగ్గర నుండి కనిపించటం లేదట. పాపం! ఏమయి పోయాడో! ఎక్కడున్నాడో ఆ అభాగ్యుడు!'

ఈ విషయం తెల్సిన దగ్గర నుండి మమతలో అశాంతి మరీ ఎక్కువయింది. తనే దీనంతటికీ కారకురాలైనట్లు, తను యీ అవాంఛితం చేయకపోతే బారు యిలా ఎవ్వరికీ తెలీకుండా వుండరు. అలాంటప్పుడు మేం ఎంతో అన్యోన్యంగా కలిసి వుంటే ఎంతో బావుణ్ణు. ఆయన తప్పును కొన్నాళ్ళకయినా ఆయన సరిదిద్దుకుని వుండేవారు నేను కాస్త సహనంతో వుంటే! కాని నాలో ఆ సహనం కరువయింది. అందుకే మా జీవితం యిలా అయిపోయింది—అని వాపోవటం ప్రారంభించింది మమత.

తన బాధలు మరచి పోవటానికి, అనాధ శరణాలయంలో వుండే ఒక 'పసిని' పెంచుకోవటం ప్రారంభించింది మమత. రజని వయసు ఏడేళ్ళు. తన ముద్దు మాటలతో మమతని 'అమ్మా' అంటూ పిలుస్తూ, ముద్దు కబుర్లు చెబుతుంటే మమత ఆనందంలో ఉప్పొంగి పోవటం ప్రారంభించింది. కొద్దిగా గతం మరవగలగటం సాధ్యమవ సాగింది మమతకి.

మూడేళ్ళు గడిచాయి.

రజనికి పదేళ్ళు వచ్చాయి. మమత కూడ తన గతం గురించి పట్టించుకోవటం లేదు. స్కూల్‌కి వెళ్ళటం, రజని గురించి ఆలోచించటం—యిలా గడుస్తుంది కాలం!

ఆ వేళ సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి మమత వంట చేస్తుంది. అరుగుమీద రజని కూర్చుని ఏవో బొమ్మలు గీస్తుంది.

వర్షం నెమ్మదిగా ప్రారంభమయి ఎక్కువయింది. వర్షంలో తడుచుకుంటూ ఒక గెడ్డాలతో చిక్కి శల్యమై వున్న వ్యక్తి రాసుకుంటున్న అరుగుమీదకి వచ్చి నిల్చున్నాడు. వర్షంలో బాగా తడిచి పోయాడు. చలితో వణుకుతున్నాడు.

'బాగా తడిసి పోయారే! తువ్వాలు ఇచ్చేదా!' అంటూ ముద్దు ముద్దు మాటలతో గబగబా వెళ్ళి తువ్వాలు తెచ్చి యిచ్చిన పాపని చూసి ఎంతో ముచ్చట పడ్డాడా వ్యక్తి.

'కాఫీ తాగావే రజనీ!' అంటూ అరుగుమీదకొచ్చిన మమత అరుగుమీద గడ్డాలతో చిక్కి శల్యమైన ఆ వ్యక్తిని చూసి 'ఏమండీ!' అంటూ బావురుమని అతని కాళ్ళ మీద పడింది.

కరుణాకర్ మమతని గుర్తుపట్టాడు. చూపులతో రజనివైపు చూసాడు. 'ఒక పుణ్యాత్మురాలివలన నా ఆత్మహత్యా ప్రయత్నం విఫలమైంది. ఇక్కడే అనాధ శరణాలయం పిల్లలకి టీచర్‌గా వుంటున్నా. ఈపాప రజనిని పెంచుతున్నానండి' అంది మమత.

'దీనికంతటికీ కారణం నేనే మమతా! నన్ను క్షమించవూ!' అంటూ మమత చేతులు పట్టుకున్నాడు.

'మన గతి తప్పిన జీవితం యిప్పటికయినా స్థిరపడుతుంది. దీనంతటికీ కారణం నా అహానం తొందరపాటు కారణం క్షమించవలసింది మీరేనండీ!' అంటున్న మమతని సరిసరాలు మరిచి 'మమతా! నీది అమృత హృదయం!' అంటూ తన బాహువుల్లో తీసుకున్నాడు కరుణాకర్!

'అమ్మ ఎప్పుడూ చెప్పలేదే యితని గురించి' అని ఆశ్చర్యంగా చూసింది పదేళ్ళ రజని!

'ఇవాళెంత సుదినం. జన్మలో చూడలేనేమో' అనుకున్నది. ...ప్పుడే వచ్చిన సుందరమ్మ మమత, కరుణాకర్‌ళని చూ...